సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా



మన చౌరాస్తా Telugu News Channel

The Complete News way

సంపుటి : 02 | సంచిక : 78 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | బుధవారం | 09.07.2025

సెప్టెంబర్ 30 లోపు స్థానిక ఎన్నికల ప్రక్రియ ముగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వం కూడా స్థానిక ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నది. జులై చివరి వారం లేదా ఆగస్టు ఎన్నికల ప్రక్రియ మొదలు కానుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రమంతా స్థానిక ఎన్నికల హడావుడి క్రమంగా పెరుగుతున్నది. కానీ జనగామలో మాత్రం అందుకు భిన్నంగా ఉంది.

- మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి

3వ పేజీలో...




## జనగామలో సైలెన్స్

## రాష్ట్రమంతా స్థానిక జోష్..!

జిల్లాలో కనీస సన్నద్ధతత లేని పార్టీలు

క్యాడర్‌ను పట్టించుకోని ముఖ్య లీడర్లు

ప్రధాన పార్టీలన్నింటిది అదే తీరు..!



## వైఎస్ఆర్‌కు ఘన నివాళి

- జిల్లా వ్యాప్తంగా జయంతి వేడుకలు
- సేవా కార్యక్రమాలు నిర్వహించిన జననేత అభిమానులు

4



## ఫీవర్ సర్వే పక్కాగా చేపట్టాలి

4

- జనగామ కలెక్టర్ రిజ్వాన్ బాషా



## మున్సిపల్ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

2

- అడిషనల్ కలెక్టర్ పింకేష్ కుమార్




## ఉత్కృష్ట సేవా పతకానికి జనగామ డీసీపీ

3

- అభినందనలు తెలిపిన ప్రముఖులు

# విద్యారంగానికి ప్రభుత్వం పెద్దపీట

## ఇంటర్ అడ్మిషన్లు పెరగాలి

## కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగామ, మన చౌరాస్తా :** రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వ విద్య సంస్థల్లో మెరుగైన విద్య దొరుకుతుందని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని మినీ సమావేశ మందిరంలో ఇంటర్ అడ్మిషన్లపై ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాళ్లతో అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..ఇంటర్ అడ్మిషన్ల కోసం స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. జూనియర్ కళాశాలలో విద్యార్థుల ఎన్‌రోల్ మెంట్, మైనర్ రిపేర్లు , విద్యార్థుల వసతి, ఇతర మౌలిక సదుపాయాలు తదితర అంశాలపై కలెక్టర్ చర్చించి అధికారులకు పలు సూచనలు చేశారు. జూనియర్ కళాశాలలో పూర్తి స్థాయి అడ్మిషన్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని, పదవ తరగతి పాస్ అయిన ప్రతీ విద్యార్థి ప్రభుత్వ జూనియర్ కళాశాల లో చదివేల చర్యలు తీసుకోవాలన్నారు. జూనియర్ కళాశాలలో సివిల్ వర్క్, విద్యుత్ సరఫరా, పారిశుద్ధ్య, నీటి సరఫరా వంటి మౌలిక సదుపాయాల కల్పన, మైనర్ రిపేర్ పనులకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందని, నిధులను సద్వినియోగం చేసుకుంటూ మరమ్మత్తు పనులు పూర్తి చేయాలన్నారు. లెక్చరర్స్ కూడా సకాలంలో కళాశాలకు హాజరు కావాలన్నారు. ఎప్పటికప్పుడు విద్యార్థుల సామర్థ్యాన్ని పర్యవేక్షణ చేయాలన్నారు. సమావేశం లో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్స్, డీఈఓ, అధికారులు పాల్గొన్నారు.



# మాత్రా క్రమంలో భద్రకాళి అమ్మవారు

**వరంగల్, మన చౌరాస్తా :** వరంగల్ మహానగరంలో చరిత్ర ప్రసిద్ధిగాంచిన శ్రీ భద్రకాళీ దేవస్థానంలో శాకంభరీ నవరాత్ర మహోత్సవాలు మంగళవారం 13వ రోజుకు చేరుకున్నాయి. ఉదయం నిత్యాహ్నికం పూర్తిచేసిన అనంతరం తిథి మండల దేవతా యజనంలో భాగంగా కాళీక్రమాన్ని అనుసరించి అమ్మవారి ఉత్సవ మూర్తులలో ఇచ్చాశక్తిని మాత్రాక్రమంలో, షోడశీ క్రమాన్ననుసరించి జ్ఞానశక్తిని సర్వమంగళ క్రమంలో అలంకరించారు. ఆలయ ప్రధాన అర్చకులు భద్రకాళి శేషు ఆధ్వర్యంలో పూజారాధనలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో కే శేషుభారతి, ఆలయ సిబ్బంది, ధర్మకర్తలు తగు ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దంపతులు ,కూడా చైర్మన్ ఇనుగాల వెంకట్రాంరెడ్డి తదితరులు దర్శించుకున్నారు.



### రేపు శాకంభరి అలంకరణ

ఉత్సవాలలో భాగంగా గురువారం ఉదయం 9 గంటలకు భద్రకాళి అమ్మవారు శాకాంభరి అలంకరణలో దర్శనం ఇవ్వనున్నారు. ఇందుకుగాను మంగళవారం శ్రీలక్ష్మీ వెంకటేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో భక్తులువరంగల్ ఓసిటీ నుంచి అలంకరణకు సంబంధించిన కూరగాయలు, పండ్లు, ఆకుకూరలు, పుష్పాలను తీసుకొని శోభాయాత్రగా తరలివచ్చి సమర్పించారు. శాకాంభరి అలంకరణలో దర్శనం చేసుకునే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ప్రత్యేక క్యూ లైన్లను ఏర్పాటు చేయడంతో పాటు అన్ని సౌకర్యాలను కల్పించారు.

# ఇందిరమ్మ ఇండ్లలను పరిశీలించిన కలెక్టర్

**జనగామ, మన చౌరాస్తా :** నిరుపేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం కావాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం జనగామ మున్సిపాలిటీ లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను కలెక్టర్ పరిశీలించారు. ఇందులో భాగంగా మున్సిపాలిటీలోని 21 వ వార్డు కుర్మవాడలో జరుగుతున్న ఇంటి నిర్మాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. ఆర్థిక పరిస్థితి దయనీయంగా ఉందని.. కడు నిరుపేద కుటుంబం అయిన మాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయండని పర్ష సాయి అనే దివ్యాంగుడి తల్లిదండ్రులు గ్రీవెన్స్‌లో వినతి సమర్పించిన విషయం విదితమే. ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. మంగళవారం ఇళ్ల నిర్మాణాల పరిశీలన లో భాగంగా వారి ఇంటి కలెక్టర్ పరిశీలించి తొందరగా పూర్తి చేసుకోవాలని సూచించారు. దశల వారీగా ప్రభుత్వం నగదును జమ చేస్తుందన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.





# మున్సిపల్ స్థలాలను ఆక్రమిస్తే చర్యలు తప్పవు

## అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

**జనగామ, మన చౌరాస్తా :** మున్సిపల్ స్థలాలను ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ హెచ్చరించారు. సోమవారం జనగామ మున్సిపాలిటీలో సుమారు రెండు కోట్లతో చేపట్టిన అభివృద్ధి పనులను మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, ఆర్ అండ్ బీ ఈఈ స్వరూప, మున్సిపల్ ఏఈ మహిపాల్ తో కలిసి ఏసీపీ పండరి చేతన్ నితిన్ , అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా సిద్దిపేట రోడ్డులోని నెహ్రూ పార్క్ వద్ద ఏర్పాటు చేసే ట్రాఫిక్ కంట్రోల్ పనులను చెక్చేశారు. అనంతరం నెహ్రూ పార్క్ నుంచి హైదరాబాద్ వెళ్లే దారిలో చేపట్టనున్న పనులను రోడ్లు భవనాల శాఖ అధికారితో కలిసి పరిశీలిస్తూ రహదారి విస్తరణలో భాగంగా విద్యుత్ పోల్స్ జరిపేందుకు ప్రతిపాదనలు అందజేయాలని అధికారులను సూచించారు. అనంతరం వరద నీటి కాలువ పనులను పరిశీలిస్తూ త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.




# 'బోనమెత్తి రావమ్మ' పోస్టర్ ఆవిష్కరణ

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ జిల్లా కేంద్రంలోని జేఎస్‌కే ట్యూన్స్ సమర్పణలో బోనమెత్తి రావమ్మ రంగమేక్కి అడవమ్మ సరికొత్త బోనాల పాట పోస్టర్ ను మంగళవారం హైదరాబాదులో ప్రముఖ శివశక్తి తెలంగాణ జోగిని శ్యామల ఆవిష్కరించి పూర్తి పాటను యూట్యూబ్ చానెల్ లో విడుదల చేశారు. ఈ పాట జనగామ జిల్లా పరిసర ప్రాంతాలలో వీడియో చిత్రీకరణ చేశారు.ఈ పాట రచన సంగీతం చిలుమోజు సాయికిరణ్ చేయగా జ్యోతిక ముదిరాజ్ గానం చేసి మెయిన్ లీడ్ గా నటించారు. ఈ సందర్భంగా జోగిని శ్యామల మాట్లాడుతూ భవిష్యత్తులో మరికొన్ని పాటలు రచించి చిత్రీకరించి ఉన్నత స్థాయిలో నిలవాలని జేఎస్‌కే ట్యూన్స్ బృందాన్ని అభినందించారు. చానెల్ అధినేత చిలుమోజు సాయికిరణ్ మాట్లాడుతూ ఎంతో శ్రమించి పాటను షూటింగ్ చేశామన్నారు. కార్యక్రమంలో జ్యోతిక ముదిరాజ్, జానపద గాయకులు సూర్యప్రకాశ్ కళాకారులు పాల్గొన్నారు.

(మన చౌరాస్తా, జనగామ ప్రతినిధి :)

సెప్టెంబర్ 30 లోపు స్థానిక ఎన్నికల ప్రక్రియ ముగించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ప్రభుత్వం కూడా స్థానిక ఎన్నికల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు చేసుకుంటున్నది. జులై చివరి వారం లేదా ఆగస్టు ఎన్నికల ప్రక్రియ మొదలు కానుంది. ఈ నేపథ్యంలో రాష్ట్రమంతా గ్రామ, మండల స్థాయిలో స్థానిక ఎన్నికల హడావుడి క్రమంగా పెరుగుతున్నది. కాంగ్రెస్ హైకమాండ్ ఆదేశాలతో ఎమ్మెల్యేలు, మంత్రులు, ఇతర నేతలు ఈ ఎన్నికలపై నియోజకవర్గాల్లో సమావేశాలు ఏర్పాటు చేసిన నేతలను, కేడర్ను స్థానిక పోరుకు రెడీ చేస్తున్నారు. సర్వేలు, అభిప్రాయ సేకరణ చేసి గెలిచే అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను ప్రారంభించారు. రాష్ట్ర వ్యాప్తంగా పలువురు బీఆర్ఎస్, బీజేపీ నేతలు కూడా దీనిపై గ్రౌండ్ వర్క్ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కూడా అన్ని పార్టీల ఆశావహులు పోటీకి ఏర్పాట్లు చేసుకుంటుండడంతో ఎన్నికల సందడి నెలకొంది. తమ తోటి నాయకులు, ముఖ్య కార్యకర్తలు, స్థానికంగా ప్రజా బలం ఉన్న వ్యక్తులు, కుల, ఇతర సంఘాల నేతలతో చర్చలు జరుపుతూ వారి మద్దతు కూడగట్టే ప్రయత్నాలు చేసుకోవడంలో మునిపోవడంతో రాజకీయ కోలాహలం నెలకొంది. అయితే జనగామ జిల్లాలో మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఎటువంటి సందడి లేదు. ఇందుకు ప్రధానంగా ఇక్కడి ముఖ్య నేతల నిర్లక్ష్యం, నిరుత్సాహ ధోరణి కారణంగా కనిపిస్తోంది.




# జనగామలో సైలెన్స్

## రాష్ట్రమంతా స్థానిక జోష్..!

- జిల్లాలో కనీస సన్నద్ధతత లేని పార్టీలు
- క్యాడర్‌ను పట్టించుకోని ముఖ్య లీడర్లు
- ప్రధాన పార్టీలన్నింటిది అదే తీరు

### కనీస చర్చలేని కాంగ్రెస్..

డీసీసీ అధ్యక్షుడు, నియోజకవర్గ ఇంచార్జి కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి స్థానిక ఎన్నికలపై ఎటువంటి ఆసక్తి చూపడం లేదని ఆ పార్టీ వర్గాలు అంటున్నాయి. కనీసం సెకండ్ క్యాడర్ నేతలతో కూడా స్థానిక ఎన్నికలపై చర్చించడం లేదని పలువురు నాయకులు చెబుతున్నారు. దీంతో ఆ పార్టీ ఆశావహులు, కేడర్ నారాజ్ అయితున్నట్లు తెలుస్తోంది. సాధరణ ఎన్నికల్లో ఓటమి తర్వాత కొమ్మూరి పార్టీలోని సీనియర్ నేతలను మరింత దూరం పెట్టారనే ప్రచారం జరుగుతోంది. దీంతో వారు ఆయనపై గుర్రు ఉన్నట్టు తెలుస్తోంది. పార్టీలో సుదీర్ఘ కాలంగా పని చేస్తున్న తమను కాదని ఇతర పార్టీల నుంచి వసల వచ్చిన వారికి ప్రాధాన్యత ఇవ్వడాన్ని వారు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇదే పరిస్థితి కొనసాగితే స్థానిక సమరంలో పార్టీకి ప్రతికూల ఫలితాలు రావడం ఖాయమని మండల, గ్రామ స్థాయి నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### సారథిలేని బీఆర్ఎస్..

ఉమ్మడి వరంగల్‌లో బీఆర్ఎస్ గెలిచిన ఏకైక నియోజకవర్గం జనగామలో ఆ పార్టీకి పెద్ద దిక్కు కరువై పార్టీ పరిస్థితి చుక్కాని లేని నావలా తయారైంది. ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి ఇటీవల కాలు విరగడంతో చికిత్స పొంది ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నారు. దీంతో ఆ పార్టీ మండల, గ్రామస్థాయి నేతలకు లోకల్ బాడీ ఎన్నికలపై దిశానిర్దేశం చేసే వారు కరువయ్యారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడిగా పనిచేసిన జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి అకాలమరణం తర్వాత ఆ పోస్టును ఇప్పటి వరకు భర్తీ చేయలేదు. దీంతో జిల్లాలో బీఆర్ఎస్ కేడర్ పరిస్థితి సారథి లేని సైన్యంగా మారింది. అసెంబ్లీ, పార్లమెంటు, ఎమ్మెల్సీ ఎన్నికల్లో వరుస ఓటములతో నిరాశాలో ఉన్న బీఆర్ఎస్ కార్యకర్తలను ఇది మరింత ఆందోళనకు గురిచేస్తోంది. స్థానిక ఎన్నికల నేపథ్యంలో పార్టీ హైకమాండ్ జనగామ నియోజకవర్గంపై దృష్టి సారించాలని నాయకులు కోరుతున్నారు.

### బీజేపీలో ఆ ముచ్చటే లేదు..

బీజేపీలో స్థానిక ఎన్నికలపై ఇప్పటి వరకు కనీస సన్నద్ధత కనిపించడం లేదు. ముఖ్యనేతలు ఎవరూ కూడా గ్రౌండ్‌లో పెరిగిన బలాన్ని స్థానిక ఎన్నికల్లో విజయంగా మార్చుకునే యోచనే చేయడం లేదు. క్యాడర్‌లో ఉన్న పోరాడే ఉత్సాహాన్ని సమర్థంగా వాడుకొని ఎక్కువ మందిని గెలిపించుకునే దిశగా నేతలు పనిచేయడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇటీవల జనగామ జిల్లా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన సౌడ రమేశ్ ఇప్పటి వరకు పార్టీ క్యాడర్‌తో సమావేశమైన దాఖలాలు కూడా లేవని ఆ పార్టీ వర్గాలే చెబుతున్నాయి. ఇదే పరిస్థితి కొనసాగితే ప్రజల్లో ఉన్న సాకూల ధోరణి కాస్తా పోయి పార్టీ బలహీనపడే ప్రమాదం ఉందని వారు ఆందోళన చెందుతున్నారు. మొత్తంగా స్థానిక ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రమంతా జోష్ ఉన్నా.. జనగామ జిల్లాలో మాత్రం అంతా సైలెన్స్ నెలకొంది.

# అన్నదానం ఎంతో గొప్పది



జనగామ, మన చౌరాస్తా : అన్నదానం ఎంతో గొప్పదని జనగామ అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్, ముఖ్య సలహాదారుడు వంగ భీమ్ రాజు అన్నారు. మంగళవారం ఓడపల్లి సత్యనారాయణ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు నాగభూషణం జనగామ అమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాజరాజేశ్వరి వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మంతెన మణికుమార్ మాట్లాడుతూ జనగామ అమ్మ ఫౌండేషన్ ఆలోచన ఆశయంలో పాల్గొని ఓడపల్లి నాగభూషణం అన్నదానం, వస్త్రదానం చేసి మానవత్వాన్ని చాటుకుంటున్నారని తెలిపారు. ప్రజలు, యువత దేశంలో ఆకలి చావుల నియంత్రణ లక్ష్యంగా నిరాశ్రయులకు అనాథలకు అండగా నిలవాలని కోరారు. రాజేశ్వరి, ఫౌండేషన్ ప్రతినిధులు నరేష్, బొట్ల సాయి పాల్గొన్నారు.

# ఉత్కృష్ట సేవా పతకానికి జనగామ డీసీపీ ఎంపిక




జనగామ, మన చౌరాస్తా : పోలీస్ శాఖలో అంకిత భావంతో పనిచేసిన వారిని భారత ప్రభుత్వం గుర్తిస్తోంది. ఇందులో భాగంగా వరంగల్ కమిషనరేట్ పరిధి వెస్ట్ జోన్ డీసీపీ రాజమహేంద్ర నాయక్ 2025 సంవత్సరానికి ఉత్కృష్ట సేవా పతకానికి ఎంపిక య్యారు. ఈ మేరకు పోలీస్ అధికారులు, జర్నలిస్టులు, పట్టణ ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా డీసీపీ మాట్లాడుతూ తన సేవలను గుర్తించి ప్రభుత్వం ఈ అవార్డుకు ఎంపిక చేయడం సంతోషంగా ఉందన్నారు.

# తలనీలాల వేలం పూర్తి

బచ్చన్నపేట, మన చౌరాస్తా : ప్రముఖ పుణ్యక్షేత్రంమైన సిద్ధేశ్వర స్వామి ఆలయంలో మంగళవారం తలనీనాల వేలం పాట నిర్వహించారు. కొడవటూరు గ్రామానికి చెందిన నడిగోటు చిరంజీవి రూ.2,35,500లకు తలనీనాల వేలాన్ని దక్కించుకున్నారు. గత సంవత్సరం కంటే ఈ ఏడాది రూ.3,500 అధికంగా వచ్చిందని దేవస్థాన సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారి వంశీ, పర్యవేక్షకులు వెంకటలక్ష్మీ, దేవస్థాన చైర్మన్ ఆముదాల మల్లారెడ్డి, ధర్మకర్తలు, అర్చక సిబ్బంది పాల్గొన్నారు.



# పారిశుద్ధ్యంపై విమర్శించడం సిగ్గుచేటు

జనగామ, మన చౌరాస్తా : పదేళ్ల అధికారంలో ఉండి పట్టణాన్ని పట్టించుకోని బీఆర్ఎస్ నాయకులు నేడు పారిశుద్ధ్యంపై విమర్శలు చేయడం సిగ్గుచేటని కాంగ్రెస్ నాయకులు అన్నారు. జనగామ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పట్టణంలోని వివిధ వార్డు అధ్యక్షులు, సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడుతూ చౌరాస్తాలో ఫొటోలకు ఫోజులు ఇవ్వడం కాదు.. పదేళ్లలో పట్టణానికి బీఆర్ఎస్ ఏం చేసిందో చెప్పాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ చేస్తున్న నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని రాబోయే కాలంలో తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో మహమ్మద్ ముజ్జు, మిద్దెపాక స్టాలిన్, మహమ్మద్ ఇస్మాయిల్, నరింగరావు, మేకల సమ్మయ్య, మహమ్మద్ కలిమొద్దీన్, మహమ్మద్ అయూబ్, లింగాల అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఘనంగా శీతల పండుగ

పాలకుర్తి, మన చౌరాస్తా: జనగామ జిల్లా పాలకుర్తి మండలంలోని అన్ని తండాల్లో మంగళవారం శీతల పండుగ (దాటుతా) నిర్వహించారు. గిరిజనులు సాంప్రదాయ బద్ధంగా పూజలు నిర్వహించారు. రాళ్లను తండా దేవతలుగా భావించి అలంకరించి నైవేద్యం సమర్పించారు. పశువులను దాటించారు. మహిళలు ప్రత్యేక ఆటపాటలతో తండాల్లో సందడి చేశారు.

# ఫీవర్ సర్వే చేపట్టాలి

- టీబీ ముక్త్ భారత్ అభియాన్‌ను సమర్థవంతంగా నిర్వహించాలి
- దోమల నివారణకు నిరంతర చర్యలు
- కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**జనగామ, మన చౌరాస్తా :** జిల్లాలో ప్రణాళికాబద్ధంగా ఇంటింటి ఫీవర్ సర్వే చేపట్టాలని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మంగళవారం నుంచి ప్రారంభమైన ఫీవర్ సర్వేను క్షేత్రస్థాయిలో కలెక్టర్ పరిశీలించారు. ముందుగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లిన కలెక్టర్ 100 రోజుల టీబీ ముక్తా భారత్ క్యాంపెయిన్‌లో భాగంగా.. టీబీ బారిన పడిన వారిని, అలాగే వ్యాధి లక్షణాలు ఉన్న వారిని ఎలా గుర్తిస్తున్నారు? యాక్షన్ ప్లాన్ ఎలా చేశారు? సరిపడా మెడిసన్ ఉన్నాయా? ల్యాబ్‌లో నిరార్ధణ పరీక్షకు కావలిసిన పరికరాలు ఉన్నాయా? అని మెడికల్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సీజనల్ వ్యాధుల దృష్ట్యా వైద్యులు అప్రమత్తంగా ఉండాలని, నిరంతరం రోగులకు అందుబాటులో ఉండాలన్నారు. అనంతరం 13వ వార్డులో జరుగుతున్న ఫీవర్ సర్వే ను కలెక్టర్ పరిశీలించి జ్వరం, దగ్గు, ఒంటి నొప్పుల వంటి లక్షణాలు ఉన్నవారిని గుర్తించి అవసరమైన పరీక్షలు, వైద్య సేవలు అందించాలన్నారు. ఇప్పటి వరకు ఎన్ని కేసులని గుర్తించారని అడిగి తెలుసుకున్నారు. ఇంటింటి ఫీవర్ సర్వేను అత్యంత ప్రాధాన్యతగా తీసుకోవాలని మెడికల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.మలేరియా, డెంగ్యూ తదితర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. హెల్త్, మున్సిపల్, పంచాయతీ శాఖ అధికారులతో మున్సిపాలిటీల్లో, గ్రామాల్లో సమన్వయంగా పని చేసి దోమలు వ్యాప్తి చెందకుండా డ్రై డే, యాంటీ లార్వాల్ స్ప్రే ప్రక్రియను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. ఈ రోజు జనగామ పట్టణానికి సంబంధించి మెడికల్ అధికారులు 953 ఇళ్లల్లో ఫీవర్ సర్వే చేయగా 11 మంది జ్వరం బారిన పడినట్లు గుర్తించారు. కార్యక్రమం లో మెడికల్ అధికారి శ్రీతేజ, సూపర్‌వైజర్ రమేష్, ఇతర మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.





# వైఎస్ఆర్‌కు ఘన నివాళి

**జనగామ, మన చౌరాస్తా :** మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్ లో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య వైఎస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆలేరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు ఉన్నారు.



## జనగామలో...

జన హృదయ నేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు జనగామలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని గిర్నిగడ్డలో ఉన్న వైఎస్ విగ్రహానికి పార్టీ నేతలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చెంచారపు బుచ్చిరెడ్డి, పీఏసీఎస్ డైరెక్టర్ వంగాల మల్లారెడ్డి, మాజీ కౌన్సిలర్లు మేడ శ్రీనివాస్, గాదపాక రామచందర్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు తోట సత్యం, జమాల్ షరీఫ్, గౌస్, జాఫర్ షరీఫ్, సమ్మయ్య యాదవ్, వివిధ వార్డు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు విజయ్ కుమార్, ప్రవీణ్ కుమార్, స్టాలిన్, ముజ్జు, కైలాసం, నాయకులు బాల్నే సుధాకర్, నర్సింగరావు, కృష్ణ రెడ్డి, రఘు, రవి, రాజు తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులకు పలక పంపిణీ..

జనగామ జిల్లా కేంద్రంలో ఘనంగా వైఎస్సార్ జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా వైఎస్సార్ అభిమాని బొడ్డు ప్రవీణ్ పట్టణంలోని వైఎస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బచ్చన్నపేట మండలంలో కేసిరెడ్డిపల్లి, బండా నాగారం గ్రామాలలో అంగన్‌వాడీ కేంద్రాలలో పిల్లలకు పలకలు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యాసరపు కరుణాకర్, జరిపోతుల శ్యామ్, తాండ్ర నవీన్, తాండ్ర నవీన్ కుమార్, గణిపాక గణేష్, ఎర్రవెల్లి సుధాకర్, ఎర్రవెల్లి అజయ్, పసుల అరుణ్ పాల్గొన్నారు.






# ఇందిరా మహిళ శక్తి సంబురాలు

**బచ్చన్నపేట, మన చౌరాస్తా :** రచన మండల సమైక్య బచ్చన్నపేట ఆధ్వర్యంలో అధ్యక్షురాలు పచ్చిమడ్ల స్వప్న అధ్యక్షతన ఇందిరా మహిళ శక్తి సంబురాలు మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో వడ్డీ లేని రుణాల కింద మొత్తం రూ. 2.18 కోట్లు 841 మహిళా సంఘాలకు మంజూరైనట్లు తెలిపారు. అలాగే లోన్ బీమా ద్వారా 6 మంది లబ్ధిదారులకు రూ. 5,34,572 వచ్చినట్లు తెలిపారు. మహిళా సంఘాల నుంచి 36 లక్షల వ్యయంతో ఒక బస్సు కొనుగోలు చేసినట్లు సమావేశంలో వెల్లడించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి, ఎంపీడీవో, తహసీల్దార్, ఏపీఎం, అంగన్‌వాడీ సూపర్‌వైజర్, పీహెచ్‌సీ డాక్టర్, సీసీలు పాల్గొన్నారు.




# ఘనంగా కడియం జన్మదినం

**జనగామ, మన చౌరాస్తా :** తెలంగాణ రాష్ట్ర మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పుట్టిన రోజు వేడుకలను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్ యాదవ్, వైస్ చైర్మన్ కొల్లూరి నర్సింహులు (శివ), ఏఎంసీ డైరెక్టర్లు నామాల శ్రీనివాస్, తోటకూరి రమేష్, పర్శ సిద్దేష్, కుమార్, నాయకులు చెంచారపు కరుణాకర్ రెడ్డి, శేఖర్, రాజు తదితరులు కడియంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. జనగామ జిల్లా ఆర్టీఏ మెంబర్ చిలువేరు అభి గౌడ్ కూడా కడియం కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.




# సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం

**బచ్చనపేట, మన చౌరాస్తా:** సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని కిసాన్ కాంగ్రెస్ స్టేట్ కోఆర్డినేటర్ నిడిగొండ శ్రీనివాస్, కట్కూర్ గ్రామ శాఖ అధ్యక్షుడు పుట్ట నరసింహులు అన్నారు. గ్రామానికి చెందిన శారద అనారోగ్యంతో బాధపడుతుండగా వారికి రెండు లక్షల ఇరవై వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. అనంతరం బాధితురాలు శారద కుటుంబ సభ్యులు మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాపరెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామ శాఖ ఉపాధ్యక్షుడు కుంట్ల కమలాకర్, ప్రధాన కార్యదర్శి గోడుగుల సతీష్, మాజీ పిఎసిఎస్ డైరెక్టర్ గుడిసె సిద్ది నరసయ్య, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తుప్పర్తి కొమరయ్య, బొట్టు నరహరి, గంజి గోపాల్, ఏనుగుల ఐలయ్య, తుప్పర్తి ఐలయ్య, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

